క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన ర్యాలీ

వెంకటాచలం: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై సరైన అవగాహన కలిగి ఉండాలని సుపోషణ్ ప్రాజెక్ట్ అధికారిణి కొంగి మాతమ్మ సూచించారు. ఆదాని ఫౌండేషన్, ఆదాని విల్మార్ ఆధ్వర్యంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సహకారంతో మండలంలోని నాగంబొట్లకండ్రిగలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురవకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. రుతుక్రమ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం సొంతంగా ఎలా తయారు చేసుకోవాలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుపోషణ్ ప్రాజెక్ట్ టీం సభ్యులు శోభ, కృష్ణవేణి, రేవతి, సుమతి, చందన, వనిత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు భరోసా



చిన్నారి చదువు ఖర్చులకు చెక్కు అందజేస్తున్న మాచిరెడ్డి

మనుబోలు: విధివశాత్తు తండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్‌కు సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన చిన్నారుల తల్లులను కలిసి పిల్లల చదువుకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఖర్చుల కోసం చెక్కులను అందజేశారు. గమ్మళ్లపాళేనికి చెందిన కోసూరు మహేష్ కొంత కాలం క్రితం గుండెపోటుతో మరణించాడు. అలాగే కాండ్ర మహేష్ అనే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. వీరి హఠాన్మరణంతో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనాథ్‌రెడ్డి పిల్లల చదువుకు అయ్యే ఖర్చు భరించేందుకు ముందుకొచ్చారు. 2వ తరగతి చదువుతున్న కోసూరు మహేష్ కుమారుడు వెంకటసాత్విక్, 6వ తరగతి చదువుతున్న కాండ్ర మహేష్ కుమారుడు త్రిలోక్ ఎంత వరకు చదువుకుంటే అంత వరకు తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. దీంతో శ్రీనాథ్‌రెడ్డికి పిల్లల తల్లులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు బొల్లు రాంప్రసాద్, ఎద్దల ప్రభాకర్, కిరణ్ చక్రవర్తి ఉన్నారు.

చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 13 నుంచి జరుగనున్న బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌బాబు సూచించారు. చాముండేశ్వరీదేవి ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఈఓ బండి శాంతయ్యతో కలిసి ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ 13న ధ్వజారోహణం, 21న కల్యాణోత్సవం, 23న సిరిమాను, 24న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ వసుంధర, స్థానికులు పాల్గొన్నారు.

జాఫర్‌సాహెబ్ కెనాల్‌లోకి వ్యర్థ జలాల విడుదల

తోటపల్లిగూడూరు: మండల రైతాంగానికి సాగునీరందించే ప్రధాన కాలువ జాఫర్‌సాహెబ్ కెనాల్‌లోకి వ్యర్థజలాలను వదిలిపెడుతున్నారు. దీంతో సాగునీరు కలుషితమై పంటలు పండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం కాలువలకు జాఫర్‌సాహెబ్ కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఆయా కాలువల కింద సుమారు 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సమీపంలో జాఫర్‌సాహెబ్ కాలువకు ఇరువైపులా ఉన్న పలు రైసు మిల్లులు, ఇతర పరిశ్రమల నిర్వాహకులు అందులోకి వ్యర్థజలాలను మళ్లించడంతో సాగునీరు కలుషితమవుతోంది. ఈ కారణంగా పంటలు పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలువలో ప్రవహిస్తున్న మురుగు దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అనాధికారికంగా పంటకాలువలోకి వ్యర్థజలాలను వదులుతున్న రైసుమిలులు, ఇతర పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పేరుకుపోయిన వ్యర్థాలు

సర్వేపల్లి కాలువను కొందరు స్వార్థపరులు కలుషితం చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను యథేచ్ఛగా అందులో పారేస్తున్నారు. ఫలితంగా సాగునీరు సక్రమంగా పారక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎండల తీవ్రతతో కాలువలో నీరు ఎండటంతో ఇవి దర్శనమిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో సర్వేపల్లి కాలువ దుస్థితి





గుర్రాలమడుగు ప్రాంతంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

కాకాణి హ్యాట్రిక్ విజయం ఖాయం



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(పొగతోట): ఈ ఎన్నికల్లోనూ సర్వేపల్లి నుంచి హ్యాట్రిక్ విజయాన్ని కాకాణి గోవర్ధన్‌రెడ్డి సాధించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే వ్యక్తి కాకాణి అని కొనియాడారు. ఎన్నికల నిబంధనలు టీడీపీ నేతలకు వర్తించవానని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై ఐదేళ్లు పత్తాలేకుండాపోయే సోమిరెడ్డి తాటాకు చప్పుళ్లు, బెదిరింపులకు బెదిరేదిలేదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తుందంటూ సోమిరెడ్డి పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కోట్ల రూపాయలను ఖర్చు చేసి.. మద్యాన్ని ఏరులైపారించి గెలుస్తాననే భ్రమలో ఆయన ఉన్నారని పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం పైనాపురం గిరిజన కాలనీలో టీడీపీ వారు ఘర్షణ పడితే, దాన్ని తమ పార్టీకి ఆపాదించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ విషయమై పూర్తి అవగాహన లేకుండా పత్రికల్లో ప్రచురించడం దారుణమన్నారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. నేతలు తలమంచి సురేంద్రబాబు, నెల్లూరు శివప్రసాద్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు



రక్తదానం చేస్తున్న యువకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించిన జక్కా వెంకయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో జక్కా వెంకయ్యకు నివాళులర్పించారు. పాత వెల్లంటిలో రక్తదాన శిబిరాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాల్, నేతలు పూడిపర్తి జనార్దన్, పల్లవరపు చెంచయ్య, పల్లవరపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను జరిపారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు అంకురార్పణ



హనుమాన్‌చాలీసా పారాయణం



విశేషాలంకారంలో ఆంజనేయుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలకు అంకురార్పణను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. స్వామివారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం నివేదన, హారతిని నిర్వహించారు. ఉభయకర్తలుగా స్వాతి, శ్రుతి, పుచ్చలపల్లి శ్రీరాములురెడ్డి, లీలావతి వ్యవహరించారు.

- హనుమజ్జయంతిని పురస్కరించుకొని నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం ముగిసింది. కార్యక్రమాన్ని విజయవాడకు చెందిన హనుమద్దీక్ష పీఠం భక్త బృంద ఆధ్వర్యంలో జరిపారు.

‘జయభారత్’లో అన్నదానం



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. నగరానికి చెందిన నిహితారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఆమె భర్త రాఘవరెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు వరదరాజు, పూర్ణచంద్రరావు మాట్లాడారు. తమ స్నేహితులతో కలిసి ఎస్వీఎస్సార్ నెల్లూరు సేవా సంఘ ఆధ్వర్యంలో అన్నదానాలను నిర్వహిస్తున్నామని వివరించారు. రోజుకు రూ.3800 ఖర్చవుతుందని, దాతలు సహకరించాలని కోరారు. సభ్యులు శ్రీధర్, మునగా సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): సుబేదారుపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్ర ల్యాబొరేటరీని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ బుధవారం తనిఖీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ తరుణంలో మలేరియా, డెంగీ పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు.

కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్న ఏజెంట్లకు ఐడీ కార్డులను నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం అందజేశారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించిన పత్రాలను స్క్రూటినీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కౌంటింగ్ జరగనున్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు ఏజెంట్లు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డులను విధిగా ధరించాలని చెప్పారు. ఏఆర్వో శర్మద, దేవీకుమారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యసేవలు



ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు

నెల్లూరు(అర్బన్): సామాన్యులకు అందుబాటులో ఉండేలా వైద్యసేవలందించాల్సిన అవసరం ఉందని అపోలో స్పెషాల్టీ హాస్పిటల్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని సాయిబాబా మందిరం పక్కన ఏర్పాటు చేసిన నివా హాస్పిటల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. నివా ఆస్పత్రి ఎండీ, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ మహేష్, చిన్న పిల్లల స్పెషలిస్ట్ రూప, ఐఎంఏ రాష్ట్ర పూర్వాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, డాక్టర్లు మురళీశంకర్‌రెడ్డి, బిందుమీనన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ సరస్వతీనగర్ ఫీడర్‌లో మరమ్మతులు, ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గామిట్ట పోస్టాఫీస్ వీధి, ఎంజీబీ మాల్ ఎదురుగా ఉన్న ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మూడు నుంచి వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను జూన్ మూడు నుంచి ఐదు వరకు నిర్వహించనున్నామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

ఆట విడుపు అవసరం



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

కొడవలూరు: విద్యార్థులకు విజ్ఞానంతో పాటు ఆట విడుపు అవసరమని విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య సూచించారు. కొడవలూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం క్యారమ్స్, స్కిప్పింగ్ ఆడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసాన్ని పొందవచ్చన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల ద్వారా మంచి భవిష్యత్‌ను పొందవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ విభాగంలో ఫైనలియర్ చదువుతున్న పలువురు విద్యార్థులు ఉద్యోగాలను సాధించారని కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ తెలిపారు. ఆంబర్ ఎంటర్‌ప్రైజెస్‌లో ఇంజినీర్లుగా ఉద్యోగాలు పొందిన మణిదీప్, చరణ్‌వెంకట్, మనోజ్, చేతన్య, తేజ, ఆవలన్‌ను కళాశాలలో బుధవారం అభినందించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, మెకానికల్ హెడ్ శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. పారిశ్రామికవేత్త సోంపల్లి రఘురామనాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోవిందయ్యానాయుడి సహకారంతో 900 మంది క్రీడాకారులకు వీటిని అందజేశారు. ఇంటర్నేషనల్ వాకర్స్ కో ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ నిర్వాహకులు దాసరి అనంతరామారావు, వెంకటసురేంద్రబాబు, అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హంస నూతన కార్యవర్గ ఎన్నిక



పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీహంస)పొదలకూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదలకూరులో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ బీ కమల్‌కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నూతన అధ్యక్షురాలిగా బీ మంజుల, సహాధ్యక్షుడిగా కే బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా సీహెచ్ ప్రమీల, కార్యనిర్వాహక కార్యదర్శిగా జీ రవీంద్రబాబును ఎన్నుకున్నారు. అలాగే పబ్లిసిటి సెక్రటరీగా మస్తానయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మమ్మ, నరసమ్మ, సుశీల, పద్మావతి, అనసూయ, మహిళా కార్యదర్శి భువనేశ్వరీ, జాయింట్ సెక్రటరీలుగా మస్తాన్‌బీ, మునిరాధిక, లావణ్య, సుజాత, రజిత, ఈసీ మెంబర్లుగా అరుణ, జ్యోతి ఎన్నికయ్యారు. వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, ఓజిలి మెడికల్ ఆఫీసర్ డానియల్ అభినందించారు.